# ప్రజాశక్తి

గురువారం 5 అక్టోబర్ 2023 5

శ్రీ సత్యసాయి

# ఇప్పటికీ వేరు కుంపట్లే..

◆ఎవరికి వారుగానే దీక్షలు ◆టిడిపిలో ఐక్యత అంతేనా ?

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కష్ట కాలంలోనూ టిడిపి నేతలు ఎవరికి వారుగానే ఉంటున్నారు. ఇప్పటికీ ఏకతాటిపైకొచ్చి పోరాడే పరిస్థితి లేదు. వేర్వేరు కుంపట్లే పెట్టుకుంటున్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టు అయి జైలుకెళ్లారు. అప్పటి నుంచి పార్టీ శ్రేణులు వీధుల్లోకొచ్చి వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతూ వస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. కాని నేతలు మాత్రం ఇప్పటికీ విభేదాలు వీడటం లేదు. నిరసనల్లోనూ ఎవరికి వారుగానే చేస్తుండటం గమనార్హం. ఎవరి శిబిరం వారిదేనన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒకే సమయంలో జరుగుతున్నా వేర్వేరుగా జరుగుతుండటంతో ఎవరి వైపు వెళ్లాలోనని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గంలో ప్రారంభం నుంచి గ్రూపు తగాదాలున్నాయి. మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడుల మధ్య గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. 2014లో హనుమంతరాయ చౌదరి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తనయుడు మారుతీ చౌదరి అంతా తానై వ్యవహరిస్తూ వచ్చారు. అయితే 2019 ఎన్నికలు వచ్చే సరికి హనుమంతరాయచౌదరికి కాదని ఉమా మహేశ్వరనాయుడికి టిక్కెట్టు ఇచ్చారు. ఆయన ఓటమి చెందారు. అయితే ఇప్పటికీ ఆయనే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రారంభం నుంచి ఇద్దరి మధ్య విభేదాలు నడుస్తూనే ఉన్నాయి. పార్టీ కార్యాలయంలోనే పంచాయితీ పడిన సందర్భాలూ అనేకం. ఇప్పుడు కూడా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లోనూ ఎవరి శిబిరం వారిదేనన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామిల మధ్య పొసగడం లేదు. ఈ నియోజకవర్గంలోనూ ఇద్దరు నేతలు కూడా ఇదే తీరున నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పెనుకొండలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి నియోజకవర్గంలోనూ ఇదే తీరు. పార్థసారధి, సవితల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ కూడా నిరసనలు వేర్వేరుగా కొనసాగుతున్నాయి. శింగనమలలో ప్రారంభం నుంచి బండారు శ్రావణి, టుమెన్ కమిటీ సభ్యుల మధ్య విభేదాలున్నాయి. ఇక్కడ కూడా ఎవరికి వారుగానే కార్యక్రమాలుంటున్నారు. ఇలా అనేక నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కొనసాగడమే కాకుండా పార్టీ అధ్యక్షులు జైల్లోనున్న సమయంలో జరుగుతున్న కార్యక్రమాలు సైతం విడివిడిగానే సాగుతుండటం గమనార్హం. నేతల మధ్యనున్న విభేదాలతో ఎవరి వైపు నిలబడాలో తెలియక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గందరగోళంలోకి పడుతున్నారు. పార్టీ కష్టకాలంలోనున్న సమయంలోనూ ఇదే తీరుతో వ్యవహరిస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఉంటుందంటున్నారు. అందరినీ సమన్వయం చేసుకుని నేతల మధ్యనున్నా తగ్గించే వారు లేకపోవడంతో ఇవి రోజురోజుకు పెరుగుతూపోతూనే ఉన్నాయి. ఒకవైపు అధికార పార్టీ వైసిపి తన అధికారాన్ని బలాన్ని ఉపయోగించి టిడిపిని మరింత బలహీన పరిచేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే టిడిపి నుంచి చేరికల కసరత్తు ప్రారంభించింది. అందుకు అవసరమైన ప్రణాళికల్లో వైసిపి నాయకులుంటున్నారు. రోజుకు ఏదోఒక ప్రాంతంలో చేరికలు జరుగుతున్నాయి. దీన్ని నిలువరించే స్థితిలో టిడిపి నాయకుల వైపు నుంచి ప్రయత్నాలేకపోవడం చర్చనీయాంశం.

# విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న చిన్నారులు

**పెరుగుతున్న డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులు**

**కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు**

**మురుగు కాలువలుగా మారిన నీటి పారుదల శాఖ కాలువలు**

**పట్టించుకోని పాలకులు, అధికారులు**

**ఉమ్మడి జిల్లా వాసులను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అంతటా జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత రెండేళ్లలో కంటే ప్రస్తుత సీజన్‌లో రోగుల సంఖ్య అధికంగానే ఉంది. అయితే ఆరోగ్యశాఖ లెక్కలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆ శాఖ లెక్కల కంటే రెండింతలు గ్రామాల్లో జ్వర పీడితులు ఉన్నారు. ప్రస్తుతం అక్కడడక్కడ అప్పుడడప్పుడు వానలు పడుతున్నాయి. వాటితో పాటే దోమలు ఉధృతి పెరిగింది. దీంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు అక్కడక్కడ డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.**

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 4700 ఖాళీ జాగా స్థలాలున్నాయి. అయితే వీటి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. ఈ స్థలాల్లో వర్షాలకు పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటి కింద పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని అపరిశుభ్రం చేయడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పాటు నీటి పారుదల శాఖకు చెందిన కాలువలను పురపాలక సంఘం వారు మురుగు కాలువలుగా మార్చుకున్నారు. ఆ కాలువలను శుభ్రం చేయక పోవడంతో ఆయా ప్రాంతాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వీటిపై గ్రామ, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆ స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు, కాలువలు నిండి రోడ్డుపైకి నీరు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటే కాస్తా కట్టడి చేయాడానికి అవకాశాలున్నప్పటికి ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం అక్టోబర్‌లో గాంధీ జయంతి సందర్భంగా మాత్రమే స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ జిల్లా, స్వచ్ఛ హిందూపురం అంటు నినాదాలు చేస్తు పరకలు పట్టుకుని రోడ్లపైకి వస్తారని పలువురు విమర్శిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 543 వరకు ఉప ఆరోగ్య కేంద్రాలు, 7 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. వీటితో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు ప్రతి సచివాలయానికి ఒక ఎఎన్ఎం ఉన్నారు. అయినప్పటికి ఒక్క హిందూపురం పట్టణంలోనే రోజుకు 800 నుంచి 1000 కి పైగా వివిధ అసుపత్రులకు జ్వర పీడితులు వెళ్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హిందూపురం జిల్లా అసుపత్రిలోనే రోజుకు 300 నుంచి 400 పైబడి జ్వరబాధితులు వస్తున్నారు. అయితే ఇందులో వైరల్ జ్వరాలతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అధికారులు చూపుతున్న మలేరియా, డెంగీ కేసులకు మూడింతల మంది ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు పట్టణంలో ఉన్నా ఆర్ఎంపిల వద్ద సైతం వైద్య సేవలు పొందుతున్నారు. వీరు సూదిమందు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా ఏకంగా సూది మందుతో పాటు గ్లూకోజ్ బాటిల్స్ సైతం వేస్తున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు.

**దోమల ఉత్పత్తి కేంద్రాలుగా డ్రెయిన్లు, ఖాళీ స్థలాలు**

పట్టణం నుంచి గ్రామాల వరకు ఉన్న వీధుల్లో చెత్తాచెదారాలు, డ్రెయిన్లలో మురుగు, పగలు రాత్రి తేడా లేకుండా ముసురుకుంటున్న దోమలు, అపరిశుభ్ర వాతావరణం, అడుగంటిన పారిశుధ్యం, జ్వరాలతో మంచం పట్టిన ప్రజలు. ఇదీ ఉమ్మడి జిల్లాలోని పట్టణాల నుంచి పల్లెల వరకు ఉన్న పరిస్థితి. గత కొన్ని రోజులుగా వాతావరణంలో పూర్తిగా మార్పులు రావడంతో పాటు పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. దీంతో పాటు ఖాళీ స్థలాలను ఎవరు పట్టించుకోక పోవడం వల్ల ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్థంగా మారుతున్నాయి. పట్టణాల్లో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండగా పల్లెల్లో నిధుల లేమితో పాలకులు పట్టించుకోవడంలేదు. దోమలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి రాత్రుళ్లే కాదు పగలు కూడా ప్రజలపై దాడి చేస్తున్నాయి. అపరిశుభ్రత, దుర్వాసన, దోమలతో ప్రజలు వ్యాధులు అల్లాడి పోతున్నారు. వర్షాకాలంలో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు కాని, పాలకులుకాని పట్టించుకోకపోవడం వల్లే ప్రజలకు ఈ అవస్త అని పలువురు అభిప్రాయపడుతున్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన కనీస చర్యలపై కూడా అధికారుల్లో స్పందన లేకపోవడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న జిల్లా ఆసుపత్రి**

పట్టణంతో పాటు గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో హిందూపురం జిల్లా ఆస్పత్రిలో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. అదేవిధంగా ఒపి సంఖ్య 800 నుంచి వెయ్యికి పెరగ్గా, ఇన్ పేషంట్లు 200 మందికి పైగా ఉంటారు. ఒక్క చిన్న పిల్లల వార్డులోనే 110 నుంచి 130 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ఒపి విభాగంలో 70 నుంచి 80 శాతం మంది జ్వర పీడితులే ఉన్నారు. ఇందులో డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులే ఎక్కువగా ఉన్నాయి. 500 మందికి టెస్టులు చేస్తే అందులో వైరల్ ఫీవర్స్ బాధితులు ఎక్కువగా ఉన్నారు. మిగతా వారంతా డెంగీ, టైఫాయిడ్ బాధితులు ముఖ్యంగా ల్యాబ్, ఓపీ గదుల వద్ద అందరూ జ్వరబాధితులే ఉన్నారు. దీంతో జ్వరపీడితులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ముఖ్యంగా అత్యవసర విభాగం, ఓపీ గదులు, ల్యాబ్, మందుల పంపిణీ గది, వార్డులన్నీ జ్వర బాధితులతో నిండిపోయాయి. ఫీవర్ టెస్టులకే సమయం సరిపోతోందని, ఇక మిగతా టెస్టులు చేసేందుకు సమయం చాలడం లేదని ల్యాబ్ సిబ్బంది చెబుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరబాధితుల్లో ప్లేట్‌లెట్ కౌంట్ 1.50 లక్షలకు తగ్గకుండా ఉంటే డెంగీ సోకదని అంటున్నారు. తెల్ల రక్తకణాల సంఖ్య పడిపోతే వ్యాధి తీవ్రత పెరిగి మరణాలు సంభవించే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. టైఫాయిడ్‌తో మనిషి సన్నగిల్లి కోలుకోవడానికి 20 రోజులు పడుతుందని అంటున్నారు. మెరుగైన వైద్యం అందించకుంటే పరిస్థితి విషమించే అవకాశం ఉందంటున్నారు. సీజన్ ప్రారంభం నుంచీ డెంగీ, టైఫాయిడ్ బాగా వ్యాపిస్తోందన్నారు. చాలామంది టైఫాయిడ్ బాధితులు ప్రభుత్వాస్పత్రి సహా ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటన లేకపోవడంతో జ్వరాలు ఎక్కువైనట్లు చెబుతున్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా జ్వరబాధితులను గుర్తించి వైద్యసేవలు అందించి ఉంటే కేసులు పెరిగేవి కావన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తే వ్యాధులు తగ్గుముఖం పడతాయని జిల్లా ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

ముక్కడిపేటలో పొంగి పొర్లుతున్న మురుగు కాలువ

ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, నెలకొన్న అపరిశుభ్రత

**కనిపించని నియంత్రణ చర్యలు**

మున్సిపాలిటీలు, పంచాయతీలు వర్షాకాలం ముందస్తుగా అనేక చర్యలు తీసుకోవాలి. పారిశుధ్యం, వరద నీటి పారుదలపై ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలి. అయితే అటు అధికారులు కాని, ఇటు పాలకవర్గాలుకాని ఈ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు విషజ్వరాలు, ఇతర అంటువ్యాధులతో అల్లాడిపోతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాల ద్వారా పొగ కొట్టాలి. వర్షాకాలం వస్తుందన గానే ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేసి సిద్ధం చేసుకోవాలి. వీధుల్లో డ్రయినేజీల్లో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. చెత్త, మురుగు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలి. మురుగు నీటి కాల్వలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బైటెక్స్, ఎబేట్, మలాథియాన్ ద్రావణాలు చల్లాలి. తద్వారా దోమలను అడ్డుకోవచ్చు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదిలాలి. మురుగు కాల్వల్లో తరచూ ఆయిల్ బాల్స్ వదలాలి. మడ్డి ఆయిల్ చల్లుతూ ఉండాలి. డ్రెయిన్లలో పూడికలు తొలగించి మురుగు నీటి పారుదల వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అయితే ఇలాంటి చర్యలు చేపట్టక పోవడంతోనే ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.

## మెరుగైన వైద్యం అందిస్తున్నాం

జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఎక్కువగా అనుమానిత డెంగీతో పాటు టైఫాయిడ్ కేసులు వస్తున్నాయి. జ్వర బాధితులకు తొలుత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆ తరువాత చికిత్స అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సాధారణ జ్వరమైనా ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే వ్యాధి వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం వచ్చిన బాధితుల్లో డెంగీ లక్షణాలు కనబడుతున్నాయి. వీరికి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నాము. దీంతో పాటు ఫ్లూయిట్స్, మందులతో రక్తకణాల సంఖ్య పెంచుతున్నాం. జబ్బుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

**డాక్టర్ ఆఫ్తాబ్.**
**చిన్నపిల్లల వైద్య నిపుణులు**

## జ్వరంతో టెన్త్ విద్యార్థి మృతి

**ప్రజాశక్తి గోరంట్ల రూరల్**

హేమంత్‌కుమార్

మండలంలోని సిరగంవాండ్లపల్లికి చెందిన పదోతరగతి విద్యార్థి జ్వరంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన ముద్ద రంగప్ప, రాధమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు హేమంత్ కుమార్ (15) గోరంట్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో హేమంత్‌కుమార్‌కు ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు, అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సరిగా చికిత్స అందించకపోవడంతో అనంతపురం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు బుధవారం ఉదయం హేమంత్‌కుమార్‌ను కర్నూలుకు రెఫర్ చేశారు. దీంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులు చికిత్స అందించే లోపే హేమంత్‌కుమార్ మృతిచెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. హేమంత్‌కుమార్ డెంగీ లక్షణాలతో మృతిచెంది ఉంటాడని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు, ఒక్కగానొక్క కుమారుడు జ్వరంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

# రబీ సాగుకు సమాయత్తం కండి

## జిల్లా రైతులకు శాస్త్రవేత్తల సూచన

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంపత్‌కుమార్

రైతులు రబీ సాగుకు సన్నద్ధం కావాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ సూచించారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం, జిల్లా స్థాయి సందర్శన, శిక్షణ వ్యవసాయ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో సత్య సాయి జిల్లా వ్యవసాయ సబ్ డివిజన్ల సహాయ సంచాలకులు, ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ కే. రామసుబ్బయ్య , కెవికె రెడ్డిపల్లి కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి మరియు ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ పంటల స్థితిగతులను సమీక్షించారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 2.82 లక్షల హెక్టార్లకు గాను 1.09 లక్షల హెక్టార్లు మాత్రమే పంటల సాగు అయిందని చెప్పారు. గత పది సంవత్సరాలలో సాధారణ విస్తీర్ణంతో చూస్తే కేవలం 39 శాతం మాత్రమే సాగు అయిందన్నారు. అలాగే వేరుశనగ కూడా 1.7 లక్షల హెక్టార్లకు గాను కేవలం 50 వేల హెక్టార్లు మాత్రమే సాగు అయిందన్నారు. జులై, ఆగస్టు నెలలో నమోదైన అత్యల్ప వర్షపాతం దృష్ట్యా ఈ సంవత్సరం గణనీయంగా పంటల సాగు తగ్గిందని అధికారులు తెలిపారు. అయితే సెప్టెంబర్ మాసంలో కురిసిన ఒక మోస్తరు వర్షాల వల్ల పంటల స్థితి మెరుగుపడిందని ప్రధానంగా కంది, మొక్కజొన్న, వేరుశనగ, వరి, పత్తి పంటలు ఉన్నంతవరకు ఆశాజనకంగా ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం రబీ సీజన్ ఆరంభమైనందున అక్టోబర్ మరియు నవంబర్ నెలలో కురిసే వర్షాల వల్ల రబీ ఆశాజనకంగా ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వేమన మాట్లాడుతూ రబీ సీజన్లో మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు ఇతర ముఖ్యమైన పంటలలో తెగుళ్ళు, యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా వయ్యారిభామ గడ్డి మొక్కను నిర్మూలించుకుంటే వైరస్ తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. పరిశోధన శాస్త్ర స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ ప్రొద్దుతిరుగుడు యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రాయుడు మాట్లాడుతూ కంది, వేరుశనగ, మొక్కజొన్న పంటలలో పురుగుల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ శ్రీ కే రామసుబ్బయ్య జిల్లాలోని వ్యవసాయ పంటల స్థితిగతులను వివరించారు. కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎన్ మల్లీశ్వరి రెడ్డిపల్లి కేవీకేలో లభ్యమయ్యే శనగ, పెసర. ఇతర సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల వివరాలను వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనోత్పత్తి లో భాగంగా అభ్యుదయ రైతుల పాత్ర చాలా ముఖ్యమని, ఇందుకు సహాయ సంచాలకులు అభ్యుదయ రైతుల వివరాలను తెలియాలని కోరారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవి కిషోర్ మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతుల మీద సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్, జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

# టింబక్టివ్ సంస్థపై చర్యలు తీసుకోండి

**ప్రజాశక్తి-రొద్దం**

పంట పొలాల్లో గడ్డి విత్తనాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కొగిర, కంబాలపల్లి, షాపురం గ్రామాలకు చెందిన 200 మంది రైతులు కొగిర రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూమిలో 15 రోజుల క్రితం వివిధ రకాల పంటలు సాగు చేశారు. అయితే టింబక్టివ్ వారు ఏడాదిగా రైతుల వ్యవసాయ పనులకు అడ్డుపడుతూ దొంగచాటున మా పొలాల్లో గడ్డి విత్తనాలు వేసి మమ్మలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. వన సంరక్షణ పేరుతో ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందుతూ ప్రభుత్వ భూముల్లోని ఈత చెట్లను, ఈత కల్లును అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. చెట్లను నరికి కర్నాటకకు అక్రమంగా కపలను తరలించి రూ. లక్షలు గడిస్తున్నారన్నారు. నెమళ్లను వేటాడి చంపి డిన్నర్లు ఏర్పాటు చేసుకుంటున్నారని, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అటవీ ప్రాంతంలో అనేక దోపిడీలకు పాల్పడుతున్నారని, కావున టింబక్టివ్ వారిపై చట్టపర్యమైన చర్యలు తీసుకోవాలని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గంగాధర్, మహిళా రైతులు, తదితరులు ఉన్నారు.

పోలీసుస్టేషన్ వద్ద బాధిత రైతులు

# పరిశ్రమల ఏర్పాటుకు పెద్దపీట

వర్చువల్ విధానంలో పరిశ్రమల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తదితరులు

**ప్రజాశక్తి - పుట్టపుర్తి అర్బన్**

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పరిశ్రమలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ జిల్లాలలో మొత్తం రూ. 2958.69 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏడు పరిశ్రమల యూనిట్లు, 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మరియు 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం , భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా కదిరి మండలంలోని పట్నంలో రూ.4.41 కోట్లతో చేపడుతున్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు, సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామం వద్ద యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమేటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ రూ.125 కోట్లతో చేపడుతున్న పరిశ్రమకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. అంతేకాకుండా మడకశిర మండలంలోని. ఆర్ .అనంతపురం ఎవరెస్ట్ కంపెనీ నిర్మాణం పనులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. పుట్టపర్తి కలెక్టరేట్ లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ వర్చువల్ సమావేశంలోజిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ బోయగిరిజమ్మ మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఏ రమణారెడ్డి, కదిరి ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, కంపెనీల అధికారులు జైపాల్ రావు, గురు ప్రసాద్, మధుశా, కార్తీకకృష్ణ, పరిశ్రమల జీఎం చాంద్‌బాషా, వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, జెడ్ ఎం సోనీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భగా కలెక్టర్ పి అరుణ్ బాబు మాట్లాడుతూ... 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వంతనేక ప్రోత్సాహకాలు ఇచ్చి రైతులను చిరుధాన్యాల సాగు పెంచే విధంగా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే కదిరి నియోజకవర్గం పట్నంలో రూ.4.41 కోట్ల అంచనా ఖర్చుతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ కు ముఖ్యమంత్రి భూమి పూజ చేశారన్నారు. ఈ ప్రతిపాదిత యూనిట్ స్థాపిత సామర్థ్యం రోజుకు ఆరు టన్నులుగా ఉంటుందని, ఈ యూనిట్ ద్వారా దాదాపు 20 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా మరొక 2000 మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఈ సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వివిధ రకాల చిరుధాన్యాల పిండి, గంజి, బేకింగ్ కుకీస్, మిల్లెట్ రేకులు, వెర్మిసెల్లి, నూడిల్స్, ఫోర్టిఫైడ్ మిల్లెట్ వంటి మంచి మార్కెట్ విలువ కలిగిన వివిధ ద్వితీయ ఉత్పత్తులను ప్రాసెస్ చేయడమే ఈ ప్లాంట్ ముఖ్య లక్ష్యం అన్నారు. రైతులందరూ చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

### చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ

# కొనసాగిన దీక్షలు, నిరసన ప్రదర్శనలు

## పాల్గొన్న బి.కె.పార్థసారథి, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న పార్థసారథి, పరిటాల సునీత, శ్రీరామ్, కురుబ సామాజిక వర్గం ప్రజలు

**ప్రజాశక్తి-కనగానపల్లి**

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ బుధవారం కనగానపల్లిలో కురుబ సామాజిక వర్గం ప్రజలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ప్రదర్శనకు అనుమతి లేదని కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించినా వారు లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. ముందుగా కులదైవం పెదయ్య స్వామి ఆలయం వద్దకు వెళ్లేందుకు బయల్దేరగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. పార్థసారథి, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ శాంతి యుతంగా ర్యాలీ చేస్తుంటే పోలీసులకు వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. బిసిలపై అణిచివేత ధోరణి ప్రదర్శిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. చంద్రబాబుపై అక్రమంగా కేసులు పెట్టడమే కాకుండా ఆయనకు మద్దతుగా నిలుస్తున్న వారిని అరెస్టు చేయడం ఏంటన్నారు.

**పుట్టపర్తి క్రైమ్ :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మూతికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. దీక్షలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చల పుల్లయ్య, నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

**రాష్ట్రానికి దశ, దిశ చంద్రబాబే : పరిటాల శ్రీరామ్**

**ధర్మవరం టౌన్ :** భవిష్యత్తులో రాష్ట్రానికి దశ, దిశ చంద్రబాబేనని, అలాంటి నేతను వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షల్లో భాగంగా 23వ రోజైన బుధవారం బత్తలపల్లి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా పరిటాల శ్రీరామ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో జగన్‌రెడ్డి ప్రజల్లో చేతగాని ముఖ్యమంత్రిగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధిని మరచిన వైసిపికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. సైకో పాలనకు రోజులు దగ్గర పడ్డాయని చంద్రబాబు వక్షాన సత్యమే గెలుస్తుందని తెలిపారు.

పుట్టపర్తిలో మౌన దీక్షలో పాల్గొన్న 'పల్లె', తదితరులు

**పెనుకొండ :** 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయాల్లో మచ్చ లేని నాయకులు చంద్రబాబు అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పార్థసారథి ఆధ్వర్యంలో బుధవారం గొల్లపల్లి రిజర్వాయర్‌లో జలదీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని, ఆయన కడిగిన ముత్యంలా బయటికి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహులుయాదవ్, నాయకులు చిన్న వెంకటరాముడు, జివిపి నాయుడు, రఘువీరా చౌదరి, సుబ్బరాయుడు, బోయ నాగరాజు, రామలింగ, లక్ష్మీనారాయణరెడ్డి, రమేష్‌నాయుడు, లక్ష్మిరెడ్డి, పోతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**హిందూపురం :** రాష్ట్రంలో ప్రజాస్వామ్యంతో సంబంధం లేని ప్రభుత్వం నడుస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ విమర్శించారు. బుధవారం పట్టణం, రూరల్ స్టేషన్‌ల ముందు టిడిపి నాయకులు నిరసన తెలిపి, సిఐలు, స్టేషన్ అధికారులకు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాము, సతీష్ కుమార్, రామాంజినమ్మ, పరిమళ, వెంకటేష్, అమర్నాథ్, ఆదినారాయణ, హనుమంత రాయుడు, ఇందాద్, రవీంద్రనాయుడు, దాదా ఖాన్, నజీర్ అహ్మద్, వెంకట రమణ, శివ శంకర్, శివకుమార్, అంజినప్ప పాల్గొన్నారు.

**మడకశిర రూరల్ :** అంబేద్కర్ రాజ్యాంగానికి సిఎం జగన్ తూట్లు పొడుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఈరన్న మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టు ను ఖండిస్తూ ఈరన్న ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ వెనక్కు నడిచి, అనంతరం మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈరన్న మాట్లాడు తూ వైసిపి అరాచక పాలన అంతమయ్యే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, ఆదినారాయణ అశ్వత్త రామప్ప, ప్రకాష్, రాజగోపాల్, నరసింహమూర్తి, కంచప్ప, శివానందాచారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు లక్ష పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్రపతి, చంద్రబాబు ఉన్న జైలుకు పోస్టు కార్డులు పంపారు.

**లేపాక్షి :** రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం వద్దు.. అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌ఐ షర్ఫుద్దీన్‌కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దేశమంతా ప్రజాస్వామ్య ప్రభుత్వం అమలులో ఉంటే, ఎపిలో మాత్రం రాజ్యారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమంగా అరెస్టులు చేయడం దారుణం అన్నారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే బాలయ్య అభిమానులు రాజమండ్రి ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, నాయకులు చంద్ర, రవి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు .

**మడకశిర :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రొళ్లలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలకు బుధవారం జనసేన, సిపిఎం, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం వైసిపికి చెందిన బిజి హళ్లి భోజరాజు, ముద్లగిరి, కుమార్ ఆయన అనుచరులు 5 కుటుంబాలు టిడిపిలో చేరగా నియోజ కవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 'బాబుతో నేను' కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి కార్యదర్శి గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, సన్న తిమ్మప్ప, భక్తర్, కృష్ణమూర్తి, మల్లికార్జున, మంజునాథ్, మనోహర్, అమరా పురం, మడకశిర మండల కన్వీనర్లు గణేష్, లక్ష్మీనారాయణ, జికె ఈరన్న, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

## 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

జబ్బులను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్సను ఉచితంగా అందిస్తూ పేదలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామ్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. దృష్టి లోపం ఉన్న వారికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. సిఎం జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రతి 30 వేల జనాభాకు ఒక ఆసుపత్రి, ప్రతి సచివాలయం యూనిట్ పరిధిలో ఒక విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశారన్నారు. 50 వేల మందికి పైగా వైద్య సిబ్బందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ షంషాద్ బేగం, కమిషనర్ బండి కేషన్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియ సాల్మన్, డాక్టర్ జగదీష్, కౌన్సిలర్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, కడప రంగస్వామి, చింతయల్లయ్య, మారుతిప్రసాద్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, 40 వార్డుల కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పురంలో వైద్య శిబిరాన్న సందర్శించిన దీపికవేణురెడ్డి

**హిందూపురం :** రాష్ట్రంలో ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా నిర్మించాలన్నదే సిఎం జగన్, వైసిపి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో బుధవారం కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దీపికా వేణురెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి హాజరయ్యారు. దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం దీపిక, ఇంద్రజతో పాటు పలువురు కౌన్సిలర్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, కౌన్సిలర్లు శివ, మారుతిరెడ్డి, ఆసిఫ్‌వుల్లా, చిన్నమ్మ నాగరాజు, రేష్మబాను, రోషన్ అలి, పార్వతీనాగరాజు, వైద్యులు పాల్గొన్నారు.

**రొద్దం :** మండల పరిధిలోని దొడఘట్ట గ్రామంలో బుధవారం సర్పంచి, ఎంపిటిసి ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిటిసి బాలాజీ మాట్లాడుతూ పేద ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుజాత, అనురాధ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషక పదార్థాలను ప్రదర్శనగా ఉంచి వాటి వలన కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతచారి, ఇఒఆర్‌డి కేశవరెడ్డి, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శి రెహమాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**పుట్టపర్తి రూరల్ :** మండల పరిధిలోని అమగొండపాల్యం గ్రామంలో చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఎంపిపి ఎవి రమణారెడ్డి, స్పెషలాఫీసర్ సుబ్బదాపు, తహశీల్దార్ నవీన్‌కుమార్ హాజరై మాట్లాడారు. పేదల ముంగిటే కార్పొరేట్ వైద్యం అందుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో డాక్టర్ నాగదుర్గ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బొగ్గు సురేష్, పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండల పరిధిలోని కొడవండ్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు తెలియజేశారు. కంటి చూపు, పలు రకాల ఆరోగ్య సమస్యలకు సేవలందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి గాయత్రి రెడ్డిప్పరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లోచర్ల గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఎంపిపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్ కుమార్, ఎంపిడిఒ బరాన్‌సాబ్, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సర్పంచి గంగులమ్మ, వైసిపి నాయకులు నారాయణస్వామి, అశోక్‌రెడ్డి, సూరి పాల్గొన్నారు.

# జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 'పురం' విద్యార్థులు

**ప్రజాశక్తి-హిందూపురం**

కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన పెంకాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ 4వ సౌత్ జోన్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలుర టాన్డింగ్ ఈవెంట్‌లో ఈశ్వర్, జయనీల్‌రెడ్డి, తనీశ్వర్‌రెడ్డి బంగారు, గండా ఆర్టిస్టిక్‌లో సాయి రేవంత్, చంద్రకిషోర్ బ్రాంజ్ పతకాలు సాధించారు. బాలికల టాన్డింగ్ ఈవెంట్‌లో మధుర, తన్వితరెడ్డి బంగారు, మీన సిల్వర్, గండ ఈవెంట్‌లో శరణ్య, దివ్య బంగారు, సోలో ఆర్టిస్టిక్‌లో రక్షిత బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరు నవంబర్‌లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని సౌత్ జోన్ సెక్రటరీ పి.మనోజ్‌సాయి, ఎపి సెక్రటరీ భరద్వాజరెడ్డి అభినందించారు. ఈ పోటీలకు దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 800 మంది హాజరవగా ఎపి తరపున 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి గెలుపొందిన క్రీడాకారులను పెంకాక్ సిలట్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ పి.రఫిక్ అహ్మద్, సెక్రటరీ ఆర్.జనార్దన్ రెడ్డి, ట్రెజరర్ ఎస్.రియాజ్‌బాషా, సభ్యులు ఖాన్ బాబా ఫకృద్దీన్, ప్రవీణ్ కుమార్ అభినందించారు.

**రాష్ట్ర పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు**

**పుట్టపర్తి రూరల్ :** మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 హ్యాండ్ బాల్ పోటీల్లో భాను ప్రకాష్, ఆదర్శ్ ప్రతిభ చాటారు. వీరిని ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పిడి అజీమ్‌బాషా, అధ్యాపక బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సైతం రాణించి జాతీయ స్థాయిలో పాల్గొని కళాశాలు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**రొద్దం :** రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు రొద్దం జూనియర్ కళాశాల విద్యార్థి ఆది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆది ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలపారు. విద్యార్థిని ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 'ఆదర్శ' విద్యార్థులు

సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన రొద్దం విద్యార్థి ఆది

# 16 వరకూ న్యాయవాదులు విధుల బహిష్కరణ

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

రూ. 20 స్టాంపు విషయమై ధర్మవరం కోర్టులో ఈ నెల 16వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తు న్నట్లు ధర్మవరం బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాల యంలో బుధవారం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ వందల సంఖ్యలో న్యాయవాదు లు కక్షిదారుల తరపున పిటిషన్లు దాఖలు చేస్తూ రూ. 10 స్టాంపు అతికించేవారని, ఆ స్థానంలో ఈ నెల 5వ తేదీ నుంచి రూ. 20 స్టాంపును అతికించాలని బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని న్యాయవాదులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో స్టాంపు విలువను పెంచు తున్నారని, దీంతో కక్షిదారులు న్యాయం పొందలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాయలసీమ లాంటి వెనుకబ డిన జిల్లాల్లో ఫీజులు భరించలేక హైకోర్టుకు వెళ్లే అప్పీళ్ల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. కర్నాటకలో వకాల్తాలకు అతికించే వెల్ఫేర్ స్టాంపు రూ. 30 ఉండగా ఇక్కడ రూ. 100కు పెంచారని మండిపడ్డారు. బార్ అసోసియేషన్ ఆమోదం లేకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయ తీసుకోవడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పెనుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**పెనుకొండ :** పెనుకొండ బార్ అసోసియేషన్ న్యాయవాది తిప్పేనాయక్‌పై జరిగిన దాడిని న్యాయవాదులు ఖండించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని న్యాయవాదుల విశ్రాంతి భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు మాట్లాడుతూ న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ రెండు రోజులు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తరచూ న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, వారిపై కఠిన శిక్ష వేసేందుకు కొత్త చట్టం తీసుకురావాలన్నారు. అలాగే ప్రతి పిటిషన్‌కు రూ. 20 విలువ చేసే స్టాంపు వేయాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ ఈ నెల 13వ తేదీ వరకూ కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివారెడ్డి, నాగార్జున, సుదర్శన్‌రెడ్డి, శివశర్మ, నాగిరెడ్డి, లక్ష్మినారాయణ, విక్రాంత్ నాయక్, హరీష్, శ్రీనివాసులు, వైసి. అశ్వర్థనారాయణ, మోహన్‌నాయక్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని ఎపి లాయర్స్ అసోషియేషన్(అలా) రాయలసీమ జోన్ ప్రెసిడెంట్ రాజేశ్వరి పేర్కొన్నారు. పెనుకొండ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది తిప్పేనాయక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం అమానుషమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా న్యాయవాదులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

# 'నవరత్నాలు'తో పేదల జీవితాల్లో వెలుగు

## 'గడప గడపకూ'లో ఎమ్మెల్యే కేతిరెడ్డి

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ప్రభుత్వం నవరత్నాలు పేరుతో అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం లో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని 16వ వార్డులో పర్యటించారు. వార్డులో విద్యుత్ లో ఓల్టేజీ సమ స్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేయగా సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందడం లేదని పలువురు పేర్కొనగా సచివాలయ సిబ్బందితో మాట్లా డి సమస్యలను పరిష్కరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి కొత్తగా నిర్మించబోయే ఇళ్లకు మున్సిపల్ ప్లానింగ్ తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ప్లాన్ అప్రూవ్ అయిన తర్వాతనే ఇళ్ల నిర్మించుకోవాలని సూచించారు. పథకాల అమలులో ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదని వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ డిఇ వన్నూరుస్వామి, విద్యుత్ శాఖ ఎఇ కొండారెడ్డి, నాగభూషణ, హౌసింగ్ ఎఇ బాలాజీ, మున్సిపల్ ఎఇ కళావతి, ఎఎస్ఐ బాషా, కౌన్సిలర్ కేతా లోకేష్, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ నీలూరి ప్రకాష్, కో ఆప్షన్ సభ్యుడు బూసెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

# అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

బత్తలపల్లి ఎస్ఐగా పి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరు ఎస్ఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ టీవీ శ్రీహర్ష సిఐగా ఉద్యోగోన్నతి పొందిన విషయం తెలిసిందే. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా, కర్నాటక మద్యం, నిషేధిత గుట్కాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రశాంత వాతావరణం కల్పించేందకు అందరూ సహకరించాలన్నారు. బాలికల అపహరణ కేసులు. పోక్సో కేసులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యాకలాపాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తప్పవన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తననే కలవచ్చు అన్నారు. అనంతరం ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సిఐ ఆరోహణరావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి గుత్తేదారులకు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ 3వ వార్డులో జరుగుతు న్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపాలిగీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఇప్పటికే పలు అభివృద్ధి పనులపై మంత్రి పెద్దిరెడ్డితో చర్చించామన్నారు. వారి వెంట వార్డు కౌన్సిలర్ లక్ష్మీ మహేష్ గౌడ్, నాయకులు బాలాజీ, రహంతుల్లా, ఇందాద్, రమేష్ , కురుబ సుబ్బు ఉన్నారు.

## బదిలీ ఎస్ఐకి ఘన సన్మానం

**గాండ్లపెంట :** స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం బదిలీపై వెళ్తున్న ఎస్ఐ బి.మల్లికార్జునరెడ్డిని వైసిపి నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జమేదారులు రామయ్య, శ్రీనివాసులు, నాగరాజు, బాలాజీనాయక్, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్.ఫయాజ్, ఆనంద్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## కళ్యాణ మండపానికి రూ. లక్ష విరాళం

**మడకశిర :** రొళ్ల మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీరంగనాథ సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి బుధవారం అగళి మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన సవిత, మూడ్ల గిరప్ప రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, కాంతరాజు, శ్రీరంగప్ప, తిమ్మప్ప, రమేష్ తెలిపారు.

## 7న మార్కెట్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల వేలం

**ధర్మవరం టౌన్ :** మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న గదులకు ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయం పనివేళల్లో రెవెన్యూ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలో ఎస్‌బిఐ ఆటో స్టాండ్‌కు చెందిన ఆటో కార్మికుడు దిలవార్‌బాషా రెండు నెలల క్రితం మృతి చెందాడు.దీంతో తోటి ఆటో డ్రైవర్లు తమ వంతుగా ఆ కుటుంబానికి బుధవారం రూ.11వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మౌలన అబుల్ కలాం ఆజాద్ ఆటో యూనియన్ అధ్యక్షులు నౌషద్, ఉపాధ్యక్షులు సాదిక్, దాదాపీర్, భక్తర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్వాకంతో రైతులకు నష్టం

**ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్**

అధికారులు పంట నమోదు ప్రక్రియలో అవకతవకలు చేయడంతో తాము తీవ్రంగా నష్టపోయామని మండల పరిధిలోని కేశాపురం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నారేపల్లి గ్రామంలో 2021 సంవత్సరానికి గానూ నాగప్ప భార్య వై.చంద్రమ్మకు చెందిన 3.13 ఎకరాలు, బిల్లు నాగయ్య పొలంలో కంది పంట సాగు చేసినటు రికార్డు చేశారు. అయితే ఇక్కడ పని చేసే ఎంపిఇఒ ఉద్దేశపూర్వకంగా రైతు భరోసా కేంద్రంలో సకాలంలో వేలిముద్ర వేయించుకోకపోవడంతోనే తాము నష్టపోయామని వారు వాపోయారు. ఈ విషయా న్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. ఇదే విషయంపై ఆర్‌టిఐ కింద అందిన సమాచారం ప్రకారం రూ. 80 వేలు పంట బీమా అందాల్సి ఉండగా అందలేదని వాపోయారు. అంతేకాక గ్రామాల్లో బత్తాయి పంట విస్తీర్ణం తక్కువగా ఉన్నా ఎక్కువగా ఉన్నట్లు రికార్డులు నమోదు చేసి కొందరు రైతులకు లబ్ధి చేకూర్చారని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి 2021 ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

# కొత్తచెరువు సర్పంచి, కార్యదర్శులపై డిఎల్ పిఒకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

కొత్తచెరువు మేజర్ పంచాయతీ సర్పంచి రాధా, కార్యదర్శి గోపాల్ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ శివ కుమారికి ఉప సర్పంచి యుగంధర్, వార్డు మెంబర్లు సాలమ్మగారి శివ, వాజిద్, పెయింటర్ కేశవ, అరిగల శివమారుతి, సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం డిఎల్‌పిఒ పంచా యతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె ముందే ఇరు వర్గాలు వాదోపవాదాలకు దిగా రు. పంచాయతీకి రూ. కోటి కు పైగా ఆదాయం ఉన్నా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. సర్పంచి, కార్యదర్శి కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని, పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కాలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిఎల్‌పిఒ అభివృద్ధి పనులు చేయకుండా డబ్బులు ఎలా డ్రా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, పాలకవర్గంలో తీర్మానం చేసిన తర్వాతనే అభివృద్ధి పనులకు బిల్లులు కేటాయించాలన్నారు.

విచారణ చేపట్టిన డిఎల్‌పిఒ శివకుమారి

## ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

**పెనుకొండ :** ఎన్నికలు, తదితర విషయాలపై బుధవారం కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నాయకులను ఎన్నుకోవడం, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థి దశ నుంచే పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో 4 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ముదిగుబ్బ :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం డిఐజి. అమ్మిరెడ్డి సందర్శించి రికార్డులు పరిశీలించారు. అలాగే శాంతి భద్రతలపై పోలీసులకు సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు సిఐ యతీంద్ర, పోలీసులు ఉన్నారు.

## 6న సబ్సిడీ రుణాలపై అవగాహన

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

గ్రామీణ స్థాయిలో గొర్రెల పోషణ ద్వారా ఆర్థిక పురోగతి సాధించేందుకు 'నేషనల్ లైవ్ స్టాక్ మిషన్' ద్వారా ఔత్సాహిక నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలపై ఈ నెల 6వ తేదీ పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరా మం హాలులో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ గురునాథ్‌రెడ్డి తెలి పా రు. ఆయన బుధవారం స్థానిక పశు వైద్యశాలలో మాట్లాడుతూ సదస్సులో 50 శాతం సబ్సిడీతో రూ. 20 లక్షల నుంచి రూ. కోటి వరకు ఏర్పాటు చేయదలచిన గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, దాణా తయారీ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తారన్నారు. ఉత్సాహవంతులైన, ఔత్సాహిక నిరుద్యోగ యువకులు, గొర్రెల పెంపకం దారులు, ప్రజా ప్రతినిధులు, అగ్రిగోల్డ్ ఛైర్మన్లు, కమిటీ మెంబర్లు హాజరుకావాలని ఆయన సూచించారు.

## వైసిపి సీనియర్ నాయకుడు మృతి

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన వైసిపి నాయకులు వడ్డే అమర్నాథ్ మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డితో పలువురు ప్రజాసంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబివుల్లా, 9 వ వార్డు ఇన్‌ఛార్జి నాగరాజు, మార్కెట్ చాంద్ బాష, మోతుకపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వైసిపి ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మృతుని కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు.

## టిడిపిలో పలువురు చేరిక

**మడకశిర :** మండల పరిధిలోని కోడిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సుధాకర్, హనుమం తరాయప్ప, రంగనాథ్‌తో పాటు 50 కుటుంబాలు బుధవారం స్థానిక బాలాజీ నగర్‌లోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, వైబి హళ్లి సర్పంచి రామాంజనేయులు, ఉప సర్పంచి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు రఘురాం, రవీంద్రారెడ్డి, వెంకట శివారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్, నరసింహమూర్తి, మురళికుమార్, విజయ్ కుమార్, రవిశేఖరరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, ఆనంద్, రంగనాదశెట్టి, సత్యనారాయణగుప్తా, తిమ్మప్ప, లక్ష్మీనరసప్ప, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ

**పుట్టపర్తి రూరల్ :** మండల పరిధిలోని గాజులపల్లి, నిడిమామిడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పుట్టపర్తికి చెందిన శ్రీవాణి బ్లూ సమ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. సంస్థ ప్రతినిధి శ్రీవాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు చేయూతనందిం చడంలో భాగంగా అనిల్, కేసరి, మీనా సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ పరికరాలు అందజేశా మన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏచూరి శ్రీనివాసులు, అఖిల, రాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

## కదిరి ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుని మృతికి కందికుంట నివాళి

**కదిరి టౌన్ :** పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు సుబ్బరాజుగుప్తా బుధవారం పట్టణంలోని తన నివాసంలో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుప్తా టిడిపికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షా శిబిరంలో గుప్తా మృతికి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు.

## ప్రెస్ నోట్

ధర్మవరం పురపాలక సంఘం పరిధిలో ఉన్నటువంటి సెంట్రల్ లైటింగ్ పోల్స్‌లకు వివిధ రకాల కేబుల్స్ కట్టియున్నారు. అందువలన లైటింగ్ పోల్స్ పని చేయని పరిస్థితికి వచుచున్నవి మరియు ప్రజల నుంచి పలు మార్లు ఫిర్యాదులు కూడా వచ్చియున్నవి. కావున సదరు కేబుల్స్‌కి సంబంధించిన ఓనర్లకు తెలియజేయడమేమనగా రేపు సాయంత్రం 5:00 గంటలలోగా సదరు లైటింగ్ పోల్స్‌లకు కట్టినటువంటి వివిధ రకాల కేబుల్లను వెంటనే తొలగించవలసినదిగా ఆదేశించడమైనది.

కమీషనరు
ధర్మవరం పురపాలక సంఘము